సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 7 । జనవరి । 2025



14 నుంచి బ్రహ్మోత్సవాలు

సింగోటం శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 14 నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



బీఆర్‌ఎస్ నిరసనలు

రైతు భరోసా తగ్గించారని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు.

వివరాలు 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.9 /9.7

చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సహావేశహాల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులు, ఫిర్యాదులను కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి స్వీకరించారు. రెవెన్యూ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా సూచించారు. సమావేశంలో ఆర్‌డీఓ నవీన్, డీఆర్‌డీఓ నర్సింహులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కామన్ మెనూ అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో కామన్ మెనూ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భోజనంలో తాజా కూరగాయల వినియోగంతో పాటు వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. బాలికల భద్రతకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యకు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, పాల్గొన్నారు

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పలు అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ అమీనా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో తెలుగు, జువాలజీ, డిగ్రీలో పొలిటికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా కళాశాలలో పూర్తి సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసు సేవలు వినియోగించుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ సేవలను ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి భయాందోళనలు, మధ్యవర్తుల సహాయం లేకుండా స్టేషన్‌కు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది బాధితుల నుంచి సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. ఒక్కో ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. అనంతరం సదరు పోలీస్‌స్టేషన్ అధికారితో ఫోన్ మాట్లాడి సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు..

ఈ నెల 8 నుంచి 11 వరకు పట్టణంలోని టీడీగుట్ట రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న క్రమంలో నాలుగు రోజుల పాటు టీడీగుట్ట రైల్వేగేట్ మూతపడి ఉండటం వల్ల ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, కోస్గి, హన్వాడ, కోయిలకొండ వైపు వెళ్లే వాహనాలు కలెక్టర్ బంగ్లా బ్రిడ్జి మీద నుంచి వెళ్లాలని సూచించారు. దీన్ని ప్రతి వాహనదారుడు గమనించాలని, ఈ ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలని సూచించారు.

కందులు @ రూ.7,611

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో సోమవారం కందులకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,611, కనిష్ఠంగా రూ.4,601 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్ఠంగా రూ.6,709, కనిష్ఠంగా రూ.4,537, రాగులు రూ.2,473, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,469, కనిష్ఠంగా రూ.2,280, ధాన్యం ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,619, కనిష్ఠంగా రూ.1,836, హంస రూ.1,801, మినుములు రూ.7,870 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో కందులు గరిష్ఠంగా రూ.7,459, కనిష్ఠంగా రూ.6,802 పలికాయి.

34,54,354 మంది ఓటర్లు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మహిళా ఓటర్లే



- మరో 1,899 మంది సర్వీస్ ఓటర్లు
- 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా 39,164 మందికి ఓటుహక్కు
- 3,190 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- కల్వకుర్తి, కొల్లాపూర్‌లో మాత్రమే పురుష ఓటర్లు అధికం

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	274	1,29,684	1,32,612	15	2,62,311
జడ్చర్ల	278	1,11,557	1,12,914	6	2,24,477
దేవరకద్ర	294	1,18,939	1,22,040	1	2,40,980
కొడంగల్	275	1,20,879	1,25,640	7	2,46,526
నారాయణపేట	270	1,17,536	1,21,089	4	2,38,629
మక్తల్	284	1,21,474	1,26,629	2	2,48,105
వనపర్తి	316	1,36,047	1,39,008	4	2,75,059
గద్వాల	303	1,26,502	1,31,947	11	2,58,460
అలంపూర్ (ఎస్సీ)	291	1,19,021	1,22,491	10	2,41,522
నాగర్‌కర్నూల్	270	1,17,934	1,19,483	5	2,37,422
అచ్చంపేట (ఎస్సీ)	326	1,23,935	1,25,681	4	2,49,620
కల్వకుర్తి	271	1,24,414	1,22,107	2	2,46,523
షాద్‌నగర్	268	1,21,271	1,21,976	13	2,43,260
కొల్లాపూర్	284	1,21,796	1,19,659	5	2,41,460

గతంలో విడుదల చేసిన జాబితాల ప్రకారం

నియోజకవర్గం	పార్లమెంట్ ఎన్నికలు	ఎస్ఎస్ఆర్- 2025 డ్రాఫ్టు
మహబూబ్‌నగర్	2,58,658	2,61,819
జడ్చర్ల	2,23,222	2,24,327
దేవరకద్ర	2,39,077	2,40,840
కొడంగల్	2,42,267	2,43,450
నారాయణపేట	2,35,517	2,38,202
మక్తల్	2,43,338	2,45,588
వనపర్తి	2,72,653	2,74,887
గద్వాల	2,55,866	2,57,638
అలంపూర్ (ఎస్సీ)	2,39,079	2,40,717
నాగర్‌కర్నూల్	2,38,133	2,37,390
అచ్చంపేట (ఎస్సీ)	2,47,621	2,49,035
కల్వకుర్తి	2,42,962	2,45,372
షాద్‌నగర్	2,38,338	2,41,087
కొల్లాపూర్	2,38,459	2,40,598
మొత్తం	34,15,190	34,40,950

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం స్పెషల్ సమ్మరీ రివిజన్- 2025 తుది ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసింది. గతేడాది ఆగస్టు 20న ప్రారంభమైన ఎస్ఎస్ఆర్ ప్రక్రియ బీఎల్‌ఓల శిక్షణ, ఇంటింటి సర్వే అనంతరం డ్రాఫ్టు ఎస్ఎస్ఆర్-2025 జాబితాను గతేడాది అక్టోబర్ 29న విడుదల చేశారు. తదనంతరం చేర్పులు, మార్పులతో పాటు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి కొత్త దరఖాస్తుల స్వీకరణ, అభ్యంతరాల నమోదుకు అవకాశం కల్పించి ఈ నెల 6న తుది జాబితాను ప్రకటించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్- 2025 ప్రకారం ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 34,54,354 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 17,43,276, పురుషులు 17,10,989, ఇతరులు 89 మంది ఉన్నారు. మరో 1,899 మంది సర్వీస్ ఓటర్లు నమోదయ్యారు. సర్వీస్ ఓటర్లతో కలిపి ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లు 34,56,253 మంది ఉన్నారు. వీరి కోసం 3,190 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం 2024 అక్టోబర్ 29న ప్రకటించిన ఎస్ఎస్ఆర్- 2025 డ్రాఫ్టు ఓటర్ల జాబితా కంటే తుది జాబితాలో 13,404 మంది ఓటర్లు పెరగడం గమనార్హం.

❒ ఎస్ఎస్ఆర్- 2025లో ఓటరు నమోదుకు జనవరి 1 అర్హతగా తీసుకొని కొత్త దరఖాస్తులను స్వీకరించింది. గతేడాది మే నెలలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే ఎస్ఎస్ఆర్- 2025 తుది జాబితాలో 39,164 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. తాజాగా విడుదల చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ఓటర్ల తుది జాబితా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ఆయా రాజకీయ పార్టీలను అప్రమత్తం చేసినట్లయ్యింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రానున్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎస్ఎస్ఆర్- 2025 ఓటర్ల తుది జాబితా ప్రాధాన్యత సంతరించుకుంది.

అతివలదే పైచేయి..



ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన ఎస్ఎస్ఆర్- 2025 ఓటర్ల తుది జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలు మినహా మిగతా అన్నిచోట్ల పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం విశేషం.

వైజ్ఞానిక మేళాకు సర్వం సిద్ధం

ఎగ్జిబిట్లను సిద్ధం చేసుకుంటున్న విద్యార్థులు



- పోలేపల్లి ఎస్‌వీకేఎంలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి
- నేటినుంచి 3 రోజుల పాటు ప్రదర్శనలు
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న మంత్రులు కోమటిరెడ్డి, దామోదర రాజనర్సింహ

చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించేందుకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాలలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఇన్‌స్పైర్ అవార్డులు, రాష్ట్రస్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించనున్నారు. మొత్తం 863 ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించనున్నారు.

వివరాలు 8లో ▸

హ్యాండ్‌బాల్ పోస్టర్లను ఆవిష్కరించిన సీఎం



జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో మెయిన్ స్టేడియంలో 10వ తేదీ నుంచి 14 వరకు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా అండర్-17 జాతీయస్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, పార్లమెంట్ కందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

\- మహబూబ్‌నగర్ క్రీడలు

5,35,058 మందికి వైద్య సేవలు

- గతేడాది జనరల్ ఆస్పత్రిలో 8154 ప్రసవాలు
- 7,387 మందికి మేజర్ ఆపరేషన్లు
- సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్



వివరాలు వెల్లడిస్తున్న డా. సంపత్‌కుమార్ సింగ్

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో 2024 సంవత్సరంలో ఓపీ ద్వారా 5,35,058 మంది రోగులకు వైద్య సేవలు అందించామని, ఇక ఆస్పత్రిలో చేరి వైద్యం పొందిన వారు 45,674 మంది ఉన్నారని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా 4,258 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. జనరల్ ఆస్పత్రికి సంబంధించి 2024లో వార్షిక నివేదికలో భాగంగా ఏడాది కాలంలో ఆస్పత్రిలో అందించిన వైద్యసేవల వివరాలను ఆయన వెల్లడించారు. గాంధీ, ఉస్మానియాలకు రెఫర్ కేసులు తగ్గించామని, ఆస్పత్రిని పూర్తిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని పరికరాలు పెంచడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నర్సుల ప్రవర్తనలో మార్పు రావడానికి ప్రత్యేక కౌన్సెలింగ్, శిక్షణలు అందిస్తామని వెల్లడించారు. ఈ ఏడాది పేద రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామన్ని పేర్కొన్నారు.

❒ జనరల్ ఆస్పత్రిలో ఏడాదిలో 58,150 మంది గర్భిణులకు చికిత్స అందించగా.. ఇందులో 11,500 ఐపీ కేసులు ఉన్నాయన్నారు. 8,154 ప్రసవాలు జరిగితే.. ఇందులో ఆపరేషన్ ద్వారా 4,895, సాధారణ కాన్పులు 3,259 ఉన్నాయి. కాన్పు సమయంలో ఐదు మరణాలు ఉన్నాయన్నాయి. మేజర్ సర్జరీలు 7,387, మైనర్ సర్జరీలు 34,854 చేయడం జరిగిందని, ల్యాబ్‌లో 7,85,021 మందికి రక్త పరీక్షలు చేసినట్లు వివరించారు. ఎక్స్‌రే 91,556, యూఎస్‌జీ 37,825, సీటీ స్కాన్ 15,267, డయాలసిస్ 5,949 మందికి చేసినట్లు వెల్లడించారు. ఏడాది కాలంలో 1,898 మంది మరణించారని, 652 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈసీజీ 32,359, హెచ్ఐవీ పరీక్షలు 18,460 మందికి చేస్తే ఇందులో 575 పాజిటివ్ వచ్చాయన్నారు. పాముకాటు 923, కుక్కకాటు 11,278, ఈఎన్‌టీ విభాగంలో 14,546 మందికి వైద్య సేవలు అందించారు. ఆర్థో విభాగంలో 32,166 ఓపీ కేసులు వస్తే, ఐపీ కేసులు 1,230 ఉన్నాయని, ఆర్థోలో మేజర్‌గా 819, మైనర్ సర్జరీలు 2,879 చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లల విభాగంలో ఓపీ కేసులు 57,717, ఐపీ కేసులు 5,430 నమోదు కాగా పీఐసీయూ ఐపీ 6,093, ఎస్ఎన్‌సీయూ ఓపీ 8,313, ఎస్ఎన్‌సీయూ ఐపీ 2,044 మంది చిన్నారులకు చికిత్స అందించారు. ఇక కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు 1,711, టీబీ పరీక్షలు 1,716 మందికి చేస్తే 102 మంది నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రికి వచ్చిన 12,003మందికి వైద్య చికిత్సలు అందించినట్లు వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- పాలమూరు యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్
- మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించిన వీసీ



సన్మానం పొందిన మహిళా అధ్యాపకులతో వీసీ శ్రీనివాస్, పీయూ సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పాలమూరు యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పీయూలోని లైబ్రరీ ఆడిటోరియంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు ఉన్న క్రమంలో సావిత్రిబాయి చదువుకొని పలువురు మహిళలకు విద్య నేర్పించి దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా ఘనతను సాధించారన్నారు. మహిళ అభ్యున్నతికి పాటు పడిన ఆమెను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళలు విద్యా, ఉపాధి, రాజకీయం, ఉద్యోగాల్లో ముందంజలో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురు మహిళా అధ్యాపకులను వీసీ ఘనంగా సన్మానించారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, రీసోర్సుపర్సన్ భూమయ్య, వక్త సుభాషిణి, బీసీసెల్ డైరెక్టర్ ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, సంధ్యారాణి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

91 శాతం సర్వే పూర్తి

జిల్లాలో చివరి దశకు చేరకున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



- దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాల సేకరణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది
- రాష్ట్రంలో టాప్ టెన్‌లో నిలిచిన మహబూబ్‌నగర్
- జీపీలో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ప్రక్రియ

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు	2,09,514
ఇప్పటి వరకు సర్వే పూర్తిచేసినవి	1,91,520
ఇంకా వివరాలు సేకరించాల్సినవి	17,994



దేవరకద్ర మండలం హజిలాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చివరి దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలతో పోల్చుకుంటే సర్వేలో మహబూబ్‌నగర్ టాప్ 10లో నిలిచింది. సర్వేలో మొదటి స్థానంలో నల్లగొండ ఉండగా.. రెండు, మూడు స్థానాల్లో రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. చివరి రెండు స్థానాల్లో భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాలు నిలిచాయి. జిల్లాలో శనివారం వరకు 91 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తుండగా.. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఇన్‌చార్జ్‌లు సర్వే చేపడుతున్నారు. సర్వే ఈ నెలాఖరులోగా పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని, సొంత ప్లాట్ ఉన్నవారికి మొదటి అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లాలో 2,09,514 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ ప్రత్యేక యాప్‌లో పొందుపరచగా.. ఇప్పుడు ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు.

వివరాల సేకరణ ఇలా..

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలోని 441 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే బాధ్యతను కార్యదర్శులకు అప్పగించారు. వారు తమ సెల్‌ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా మీకు సొంత ఇల్లు ఉందా.. లేదా.. కిరాయి ఇంట్లో ఉంటే అది రేకుల ఇల్లా.. లేక స్లాబా, ఆ ఇంటి ఫొటో తీసుకోనున్నారు. ఎంతమంది కుటుంబ సభ్యులు ఉన్నారు.. వారికి ఏవైనా భూములు.. ప్లాట్లు ఉన్నాయా అనే వివరాలు పరిశీలించి నమోదు చేయనున్నారు. కార్లు, ఇతర ఆస్తుల వివరాలు ఆధార్ అనుసంధానంతో ఆన్‌లైన్‌లో కనిపించినప్పటికీ గతంలో వాహనాలు ఉండవచ్చు.. ప్రస్తుతం అమ్మవచ్చు.. అందువల్ల మళ్లీ సంబంధిత దరఖాస్తుదారులను అడిగి నమోదు చేస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందారా అనే వివరాలను కూడా సేకరిస్తున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలోనే..



కలెక్టర్ విజయేందిర నిరంతరం పర్యవేక్షణలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 91 శాతం పూర్తయ్యింది. సర్వేకు ప్రజలు సహకరించడంలో వేగవంతంగా కొనసాగుతుంది. త్వరలోనే మిగిలిన సర్వే కూడా పూర్తిచేస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివరాలు నమోదు చేస్తున్నాం.

\- భాస్కర్, పీడీ హౌజింగ్

పనిఒత్తిడితో సతమతం..

పంచాయతీ కార్యదర్శులు నిత్యం పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. పని దినాలతోపాటు అదనంగా ఆదివారాలు, పండగ రోజుల్లోనూ పనిచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. నిత్యం ఉదయం 7 గంటలకే విధులకు హాజరై డీఎస్ఆర్ పద్ధతిలో రహదారులు, డ్రెయినేజీలు, శానిటేషన్ వంటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తోందని, ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో అన్ని పనులూ తామే చూసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీల్లో నిధుల కొరతతో రోజువారీ పనులకు తామే పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అనేక పనులతో మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నారు.

సర్వం సిద్ధం..

ఎస్‌వీకేఎంలో రాష్ట్ర సైన్స్‌ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి మూడురోజుల పాటు బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలు
- 33 జిల్లాలు, 863 ప్రదర్శనలు, 2,200మంది విద్యార్థులు, టీచర్లు రాక
- ప్రారంభోత్సవానికి రానున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మల్టీపుల్ మోటార్ ప్రదర్శనను సిద్ధంచేస్తున్న షాద్‌నగర్ విద్యార్థులు, గైడ్ టీచర్లు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు సర్వం సిద్ధం చేశారు. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లోని ఎస్‌వీకేఎంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. 2023–24 ఇన్‌స్పైర్ అవార్డులు, రాష్ట్ర స్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శన 2024–25 రెండింటిని సంయుక్తంగా ఒకే వేదికపై నిర్వహిస్తున్నారు. సర్ జగదీశ్ చంద్రబోస్ ప్రాంగణంలో నిర్వహించే ప్రదర్శనకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు అవుతున్నారు. మొత్తం 860 ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించనున్నారు. వీటిలో ఇన్‌స్పైర్ విభాగంలో 300, జాతీయ విభాగంలో 563 ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో 2024–25కు సంబంధించి సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్యాంశంలో భాగంగా మరో ఏడు అంశాలకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించనున్నారు. వాటిలో ఆహారం, ఆరోగ్యం–పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణిత నమూనా గణన ఆలోచన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అంశాలున్నాయి.

మూడు రోజుల పాటు ప్రదర్శనలు

వైజ్ఞానిక ప్రదర్శన మూడు రోజుల పాటు కొనసాగనుంది. మొదటి రోజు ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కానున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు రానున్నారు. విద్యార్థుల ప్రదర్శనల ఏర్పాటు.

- రెండో రోజు మిల్లెట్స్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు, రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.
- మూడో రోజు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఫలితాల ప్రకటన, విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది. సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన అంశాల్లో జాతీయస్థాయికి ఎంపిక చేసే వాటి విషయంలో హైదరాబాద్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి, ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి న్యాయనిర్ణేతలు హాజరు కానున్నారు.

పుష్కరకాలం తర్వాత జిల్లాకు అవకాశం

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు జిల్లాకు పుష్కర కాలం(12ఏళ్ల) తరువాత అవకాశం లభించింది. 2012లో జేపీఎన్‌సీ కళాశాలలో రాష్ట్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఆతరువాత ఇదే కావటం విశేషం. ప్రతి ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో విద్యార్థుల సృజనకు పదును పెట్టేలా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తుంది. ఒక్కో ఏడాది ఒక్కో జిల్లాలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ ఏడాది మహబూబ్‌నగర్ జిల్లాకు ఆ అవకాశం దక్కింది. 12ఏళ్ల తరువాత మరోసారి మహబూబ్‌నగర్ వేదిక కావటం గమనార్హం. కలెక్టర్ విజయేందిర బోయి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. వేదిక నిర్మాణం, రిజిస్ట్రేషన్, పార్కింగ్, భోజనాలు, రవాణా, వసతి, ప్రయోగాల కోసం అంశాల వారీగా గదుల కేటాయింపు పూర్తిచేశారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ప్రతిరోజు 3,500మంది విద్యార్థులకు సరిపడ వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ప్రదర్శనలో జాతీయస్థాయికి ఎంపికయ్యే ప్రదర్శనల విద్యార్థులకు పురస్కారాలు సైతం అందించనున్నారు.

ఆయా జిల్లాల వారీగా ప్రదర్శించే అంశాల సంఖ్య

ఆదిలాబాద్ 20, భద్రాద్రి కొత్తగూడెం 23, హన్మకొండ 14, హైదరాబాద్ 17, జగిత్యాల్ 16, జనగాం 5, జయశంకర్ భూపాల పల్లి 17, కామారెడ్డి 16, కరీంనగర్ 32, ఖమ్మం 16, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ 21, మహబూబాబాద్ 15, మంచిర్యాల 17, మెదక్ 16, మేడ్చల్ మల్కాజిగిరి 16, ములుగు 23, నాగర్‌కర్నూలు 16, నిర్మల్ 14, పెద్దపల్లి 16, రాజన్న సిరిసిల్ల 15, రంగారెడ్డి 15, సంగారెడ్డి 17, సిద్దిపేట్ 15, సూర్యాపేట్ 16, వికారాబాద్ 16, వనపర్తి 15, వరంగల్ 16, యాదాద్రి భువనగిరి 27, మహబూబ్‌నగర్ జిల్లా 27 అంశాలు ప్రదర్శించనున్నారు.



కేటాయించిన గదిలో ప్రదర్శన సిద్ధం చేస్తున్న ఖమ్మం విద్యార్థి, గైడ్‌లు

ఎస్‌వీకేఎం ప్రాంగణానికి విద్యార్థులు, టీచర్లు

ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు ఎస్‌వీకేం ప్రాంగణానికి చేరుకున్నారు. వారి వివరాలు నమోదు చేయించి కేటాయించిన గదుల్లో ప్రదర్శనల పరికరాలు సిద్ధంచేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించి మండలంలోని మిడ్‌లాండ్, మౌంట్ బాసిల్, స్వామినారాయణ గురుకుల్, జడ్చర్ల, బాలానగర్ కేజీవీబీల్లో వసతి సౌకర్యం కల్పించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం

ప్రదర్శనకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయుల వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక స్థలం కేటాయించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



ఎస్‌వీకేఎంకు చేరుకున్న మంచిర్యాల విద్యార్థులు, గైడ్ టీచర్

జాతీయస్థాయిలో గుర్తింపు లభించేలా సైన్స్‌ఫెయిర్



వివరాలు వెల్లడిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జాతీయస్థాయిలో గుర్తింపు లభించేలా ఎస్‌వీకేఎంలో రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్‌వీకేఎంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన సైన్స్‌ఫెయిర్‌కు సంబంధించి వివరాలను ఫేర్‌కు సంబంధించి వివరాలను వెల్లడించారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించటం జిల్లాకు రెండోసారి అన్నారు. ప్రదర్శనలకు మొత్తం 51 గదులను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాస్థాయి అధికారులతో 22కమిటీలు ప్రదర్శన ఏర్పాట్లలో పాలు పంచుకుంటున్నారన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారని అన్నారు. గత ఏడాది ఓ ప్రదర్శన జపాన్ దేశంలోనూ ప్రదర్శించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. జిల్లాలో 43 ఇన్‌స్పైర్ విభాగంలో ప్రదర్శించనుండగా 11 వరకు జాతీయస్థాయికి ఎంపికయ్యే అవకాశాలున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ 11 ప్రదర్శనలను తెలంగాణ ఇండస్ట్రియల్ అధికారులు దత్తత తీసుకున్నారని, వాటిని రీసెర్చ్ చేసి అవసరమైన మార్పులు చేయనున్నారన్నారు. కొన్ని ప్రదర్శనలకు విద్యార్థులకు పేటెంట్ హక్కులు వచ్చాయని తెలిపారు. మూడు రోజుల ప్రదర్శనలో ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థుల సందర్శనలకు అవకాశం కల్పించామని, అందుకు తగినట్లుగా ప్రణాళికలు రూపొందించామన్నారు. రోజుకు 8 వేల మంది విద్యార్థులు తిలకించేలా ఏర్పాట్లు చేశామన్నారు. సీపీఓ రవీందర్, డీపీఓ శ్రీనివాసులు, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌వీకేఎం ప్రిన్సిపాల్ ఎబినేజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన సేవలు అందించాలి

- రిజిస్ట్రార్ రవీందర్



మెట్టుగడ్డ: రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మహబూబ్‌నగర్ రిజిస్ట్రార్ వి.రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోకి రాగానే అక్కడి పరిస్థితిని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ప్రభుత్వ కార్యాలయమా.. బందర్‌దొడ్డా అని మండిపడ్డారు. కార్యాలయంలో ఇష్టానుసారంగా వచ్చిన వారిని ఆయనే స్వయంగా బయటకు పంపించారు. కార్యాలయం లోపలికి వచ్చి ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న బయటి వ్యక్తులు అధికారిని చూసి పరుగులుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అన్నిసౌకర్యాలు కల్పించాలని అన్నారు. దస్తావేజుల పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా చేయాలని ఆదేశించారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు క్రీడాకారులు



భాగ్యరాజ్



ఫర్హాన్‌ఖాన్



హబీబుద్దీన్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఈనెల 7 నుంచి 13వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. భాగ్యరాజ్, గులాం ఫర్హాన్‌ఖాన్, మహ్మద్ హబీబుద్దీన్ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. భాగ్యరాజ్ ఇప్పటివరకు పది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. నాలుగు సార్లు సీనియర్ నేషనల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. హబీబుద్దీన్ రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడాడు. గులాం ఫర్హాన్‌ఖాన్ నాలుగుసార్లు జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు.

వైభవంగా చండీ యాగం

- వేదమంత్రాలతో మార్మోగిన అడవి ప్రాంతం



నవాబుపేట: మండలంలోని మైసమ్మ దేవాలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అడవి ప్రాంతం వేదమంత్రాలతో మార్మోగింది. ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, దేవాలయ అధికారి మధనేశ్వర్ రెడి, ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి పూర్ణాహుతి నిర్వహించారు. కాగా మంగళవారం దేవాలయ ఉత్సవాల్లో బాగంగా శకటోత్సవం, 116 బోనాలతో నైవేద్యాల సమర్పణ ఉంటుందని దేవాలయ చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, తులసిరాంనాయక్, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

వలలో చిక్కుకున్న భారీ కొండ చిలువ

- ఫారెస్ట్ అధికారులకు అప్పగింత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల రామన్‌పాడ్ పంపుహౌజ్ పక్కన గల కాల్వలో కొందరు వ్యక్తులు చేపల కోసం వలను వేశారు. సోమవారం అందులో భారీ కొండ చిలువ చిక్కుకుంది. వలలో చిక్కుకుని అది ఇబ్బంది పడుతుండగా అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించారు. సాగర్ స్నేక్ సొసైటీ నిర్వాహకుడు, హోంగార్డ్ చీర్ల కృష్ణసాగర్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే కాల్వ వద్దకు చేరుకొని వలలో చిక్కుకున్న కొండ చిలువను బయటికి తీశారు. దాని వయస్సు దాదాపు 9ఏళ్లు ఉండొచ్చని, 8అడుగుల పొడవు, 11కిలో బరువు ఉంటుందని కృష్ణసాగర్ తెలిపారు. వల నుంచి బయటకు తీసిన కొండ చిలువను ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. పాములను చంపొద్దని, తనకు సమాచారమిస్తే వాటిని పట్టుకుని అడవి వదిలేస్తామన్నారు.



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కృష్ణాసాగర్

హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ

- నిర్వాహకుడికి నోటీసులు జారీ



ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఓహోటల్‌లో సోమవారం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. హోటల్ కిచెన్‌లో ఆహారం తయారీ విధానం, వినియోగిస్తున్న వస్తువులు, పదార్థాలు, ఫ్రిజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతాప్రమాణాల కోసం చికెన్ బిర్యానీ, కొన్ని ముడిపదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. హోటల్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో అధికారులు నిర్వాహకుడికి నోటీసులివ్వడంతో పాటు కేసు నమోదుచేశారు. హోటల్‌లో ఏదైనా కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని విజయ్‌కుమార్ తెలిపారు. ఈతనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మనోజ్‌కుమార్, శ్రీలత, సిబ్బంది కరుణాకర్, అంజిలయ్య పాల్గొన్నారు.

- పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎస్‌వీకేఎం పాఠశాలలోని కిచెన్‌ను ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ జరుగుతున్న క్రమంలో స్థానికంగా అందుతున్న ఆహారం, తయారీ విధానాన్ని పరిశీలించారు.

హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర జట్టు ఎంపిక



జూనియర్ బాలుర జట్టుతో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది బాలుర హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన 16 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. జిల్లా జట్టును సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయోద్దీన్, శంకర్‌నాయక్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రోజ, అభిలాష్, ఉమాపతి, వీరన్న, మహేష్ పాల్గొన్నారు.

విధుల్లో ఉండగా.. కానిస్టేబుల్‌కు గుండెపోటు

- మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



వెంకటేష్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: విధుల్లో ఉన్న ఓ ఏఆర్ కానిస్టేబుల్ గుండెపోటు రాగా.. ఆస్పత్రితో చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని మర్లులో నివాసం ఉంటూ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేష్(50)కు సోమవారం ఎస్కాట్ డ్యూటీ పడింది. ఈక్రమంలో సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయం నుంచి జిల్లా జైలుకు వెళ్లి అక్కడ ఖైదీలను వాహనంలో తీసుకుని కోర్టులో హాజరుపరిచి మళ్లీ మధ్యాహ్నం సమయంలో జైలులో ఖైదీలను అప్పగించి తిరిగి బయట వచ్చాడు. ఆ సమయంలో చాతీలో నొప్పి వస్తున్నట్లు వెంకటేష్ తోటి కానిస్టేబుల్స్‌కు చెప్పి కింద కూర్చుకున్నాడు. వెంటనే వారు చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు సీపీఆర్ చేయడంతో పాటు చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. క్యాజువాలిటీలో ఉన్న వెంకటేష్ మృతదేహాన్ని ఎస్పీ డి.జానకి పరిశీలించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడు వెంకటేష్‌కు భార్య వనీత, ఇద్దరూ కొడుకులు అభినవ్, వర్షవర్ధన్‌లు ఉన్నారు. మృతదేహన్ని అతని స్వస్థలం సీసీకుంటకు తరలించారు.

14 నుంచి సింగోటం బ్రహ్మోత్సవాలు

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ రూరల్: సింగోటం శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి సింగోటం శ్రీలక్ష్మీ నరసిహస్వామి ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్ట్ బదావత్ సంతోష్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14 నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ శాఖాధికారులను ఆదేశించారు. జాతరలో తాగునీటి, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం వంటి ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. శ్రీవారిసముద్రంలో స్పీడ్ బోట్లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. శ్రీవారిసముద్రంలో తెప్పోత్సవం నిర్వహించే బోటు చెడిపోవడంతో దాన్ని మరమ్మతు చేయించకపోవడంపై ఆలయ ఈఓ రంగారావుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనకు మెమో జారీచేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. శ్రీవారి సముద్రంకట్టపై త్వరలో మహ నీయుల విగ్రహాలు ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీఓ రాంమెహన్ రావు, ఆర్డీఓ బన్సీలాల్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు..

- మహిళ దుర్మరణం

జడ్చర్ల: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వివరాలు.. ఏపీలోని కర్నూల్‌కు చెందిన పురుషోత్తం రావు, విజయలక్ష్మి భార్యాభర్తలు. వీరు ఆదివారం జడ్చర్ల నుంచి తమ సొంత కారులో కొత్తకోటకు వెళ్తున్నారు. మండలంలోని చిట్టింబోయిన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీ ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా ఆకస్మికంగా బ్రేకులు వేసింది. వెనుక వస్తున్న కారు ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. పురుషోత్తం రావుకు తీవ్ర గాయాలు కాగా వైద్య చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతురాలి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేంకటేశ్వరుడి చరిత్రను తెలిపేందుకు గిరిప్రదక్షిణ

- వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్

మదనాపురం: శ్రీకురుమూర్తి వేంకటేశ్వరస్వామి చరిత్రను దేశవ్యాప్తంగా తెలిపేందుకే వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఈనెల 11న వైకుంఠ ద్వాదశి పర్వదినం 'గిరిప్రదక్షిణ' నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జాతీయ పరిషత్ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ అన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల శ్రీకురుమూర్తి స్వామి జాతర మైదానంలో ఉమ్మడి జిల్లా వీహెచ్‌పీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ పూర్వకాలంలో గిరిప్రదక్షిణలు నిర్వహించేవారని, ప్రస్తుతం కురుమూర్తి క్షేత్రంలో గిరి ప్రదక్షిణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ శక్తిని సంఘటితం చేసేందుకే ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పేదల తిరుపతిగా పేరొందిన శ్రీకురుమూర్తి వేంకటేశ్వరస్వామి చరిత్రను దేశవ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధార్మిక సంస్థలు కలిసి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు దేవాదాయ శాఖ కూడా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, చంద్రయ్య, విభాగ్ సర్‌సంఘ్‌చాలక్ రాఘవ జనార్దన్, మాస పత్రిక ప్రముఖ్ హన్మంత్, మండల నాయకులు బింతకాలయ శివయ్య, కుర్వమహేష్, సాకలి రమేష్, బొజ్జన్న, హరినాథ్‌జీ పాల్గొన్నారు.

భూ తగాదాలతో ఇరువర్గాల ఘర్షణ

- తీవ్రంగా గాయపడిన దంపతులు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

దేవరకద్ర రూరల్: కొత్కుర్ల మండలం రాజోలిలో భూతగాదాలతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాయాదుల దాడిలో నాలుగు రోజుల క్రితం దంపతులకు తీవ్ర గాయాలు కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రాజోళికి చెందిన తుంగని నరేష్, బురాన్‌ల మధ్య 34గుంటల భూమి విషయంలో కొన్నేళ్లు వివాదం కొనసాగుతోంది. ఇప్పటికే ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించగా స్థలం విషయంలో స్టే కొనసాగుతుంది. ఈ క్రమంలోనే నాలుగు రోజుల క్రితం ఇరువర్గాలు పొలం వద్ద గొడవ పడ్డారు. ఈదాడిలో నరేష్, అతడి భార్య అరుణను దాయాదులు చితకబాదారు. దీంతో తీవ్రగాయాలు కాగా స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ నాగన్నను వివరణ కొరగా దంపతులపై దాడికి పాల్పడిన బురాన్, అతని కుమారులు నరేష్, ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చదువుకోమంటే ఉరేసుకొని బాలుడి బలవన్మరణం

నారాయణపేట రూరల్ : బడికి వెళ్లి చదువుకోమంటే ఓ బాలుడు చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. నారాయణపేట జిల్లా పేరపల్ల గ్రామానికి చెందిన గజ్జిలి బుగ్గమ్మ, శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు ఆంజనేయులు(15). ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. ఆ తర్వాత పొలం పనులకు, గొర్రెల కాసేందుకు వెళ్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. పైచదువులు చదవాలని తల్లిదండ్రులు ఆదివారం అతడిపై ఒత్తిడి చేశారు. దీంతో ఇంట్లో నుంచి బయటికెళ్లి.. రాత్రి ఎంతకీ తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. గ్రామశివారులోని మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం ఉదయం అటుగా వెళ్తున్నవారు చూసి కుటుంబీకులకు సమాచామిచ్చారు. వారు అక్కడి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.